క్లుప్తంగా

రేపు ఉపాధిహామీ ప్రజావేదిక

చిట్యాల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీపై సామాజిక తనిఖీలో భాగంగా ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఐత రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, ఉపాధికూలీలు తదితరులు హాజరు కావాలని కోరారు.

సర్టిఫికెట్ల అందజేత



రేగొండ: మండలంలో ఉన్నతి శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న వారికి మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అడిషనల్ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వసుమతి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. 35 మందికి సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీఓ రాంప్రసాద్‌రావు, ఏపీఓ జమీర్ పాషా, ఉన్నతి డీఆర్పీ కిషన్ పాల్గొన్నారు.

పంట రుణాలు ఇవ్వాలి

భూపాలపల్లి అర్బన్: అటవీ పట్టాలు పొందిన రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 5వేలకు పైచిలుకు రైతులకు పదివే ఎకరాల వరకు పట్టాలు పొందినట్లు తెలిపారు. కాగా, వారు బ్యాంకుల నుంచి ఎలాంటి రుణాలు పొందలేన్నారు. ప్రభుత్వం రుణాలు ఇవ్వకపోవడంతో ప్రైవేట్ అప్పులు చేస్తూ ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఎటువంటి నిబంధనలు లేకుండా పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రా జు, మనేటి బాపు, పోలం పోచయ్య, శివలు పాల్గొన్నారు.

నియామకం



మొగుళ్లపల్లి: సమాచార హక్కు చట్టం మేదరమెట్ల గ్రామ కన్వీనర్‌గా మేడిపల్లి తిరుపతిని నియమించినట్లు ఆ చట్టం మండల అధ్యక్షుడు కమలాపురం విజేందర్ మంగళవారం తెలిపారు. తన నియామకానికి సహకరించిన మండల శాఖ అధ్యక్షుడు కమలాపురం విజేందర్‌కు, జిల్లా కమిటీ సభ్యులకు తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు.

చేయూత



రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండలం దామారంచపల్లి గ్రామానికి చెందిన జూపాక ప్రతిభ ఎంబీఏ చదువుతుంది. కుటుంబంలో తలెత్తిన ఆర్థిక ఇబ్బందుల వలన ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లడానికి ఇబ్బందులు ఏర్పడింది. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు రూ.5 వేలు అందజేశాడు. మాజీ సర్పంచ్ జూపాక నీలాంబరం, పీఏసీఎస్ డైరెక్టర్ బోట్ల మధుసూదన్, సాయిని ముత్యం, రూపిరెడ్డి భగవాన్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

భూపాలపల్లి అర్బన్: ఇటీవల పదోన్నతి పొందిన సాంఘిక శాఖ ఉపాధ్యాయులకు సోషల్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న ప్రారంభించారు. ఈ శిక్షణలో ఎఫ్ఏల నిర్వహణ, ఉన్నతి ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫోరం నాయకులు పోతర్ల సతీష్, గుగులోత్ రాందస్, విజయబాబులు పాల్గొన్నారు.

పరామర్శ



రేగొండ(కొత్తపల్లిగోరి): రేగొండ మండల కేంద్రానికి చెందిన పెండ్యాల మల్లారెడ్డి, కొత్తపల్లిగోరి మండల కేంద్రానికి చెందిన తుమ్మనపల్లి మోహన్‌రావు, నిజాంపల్లి గ్రామానికి చెందిన తోట ఆగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం పరామర్శించారు. వారి వెంట భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, మండల నాయకులు పున్నం రవి, పట్టెం శంకర్, వీరబ్రహ్మం, సుదర్శన్, ప్రభాకర్, కుమారస్వామి, రమేశ్ తదితరులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కాళేశ్వరం: వరదను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ కిషన్, డీఎస్పీ రామ్మోహన్



పలిమెల: పోలీస్‌స్టేషన్‌ను సందర్శిస్తున్న పోలీస్ అధికారులు

కాళేశ్వరం: లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదనపు ఎస్పీ బోనాల కిషన్ అన్నారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గోదావరి ప్రవాహాన్ని మంగళవారం కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, మహదేవపూర్ సీఐ రాంచందర్‌రావులతో కలిసి పరిశీలించారు. అంతర్రాష్ట్ర వంతెన వద్ద వరద ఉధృతిని చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. 2022 జూలైలో అన్నారం బరాజ్‌లో 18లక్షలు, మేడిగడ్డ బరాజ్‌లో 29లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో తరలి వచ్చిందని గుర్తు చేశారు. గోదావరి తీర ప్రాంతాలతోపాటు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండడంతో గోదావరి, మానేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయన్నారు. మత్స్యకారుల చేపల వేటకు వెళ్లవద్దని, పశువుల కాపరులు అడవిలోకి వెళ్లవద్దని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు దాటి వెళ్లే ప్రయత్నం చేసి, ప్రమాదాల పాలు కావద్దని సూచించారు. గోదావరి ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేయాలని ఆయన పోలీసు అధికారులకు సూచించారు. ఎస్సై సీహెచ్.చక్రపాణి, కార్యదర్శి సత్యనారాయణ, ఉన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

పలిమెల: పలిమెల పోలీస్‌స్టేషన్‌ను కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డితో కలిసి అదనపు ఎస్పీ బోనాల కిషన్ సందర్శించారు. వరద బాధితులకు అందుతున్న సహాయాన్ని ఎస్సై తమాషారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలు, గోదావరికి భారీగా వరద వస్తుండడంతో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అత్యవసరమైతే ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలను పునరావాస కేంద్రాలు, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. వరదల్లో చిక్కుకుంటే వెంటనే రక్షించి సహాయం అందించాలని సూచించారు. టీజీఎస్పీ బలగాలతో మాట్లాడి మావోయిస్టుల అలికిడిపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ సంపత్‌రావు



సిబ్బందితో కలిసి మొక్క నాటుతున్న డీఎస్పీ

టేకుమట్ల: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితోనే కాకుండా ప్రజలందరితో పోలీసులు స్నేహపూర్వకంగా మెలగాలని డీఎస్పీ సంపత్‌రావు అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ ముందుగా పోలీస్‌స్టేషన్‌కు రాగానే సివిల్, టీఎస్ఎస్పీ పోలీసులతో గౌరవ వందనం స్వీకరించి, పోలీస్‌స్టేషన్ ఆవరణంలో సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్సై గోగికారి ప్రసాద్‌లతో కలిసి మొక్కలు నాటారు. అలాగే పోలీస్ సిబ్బంది నిర్వర్తిస్తున్న విధులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి పలు సలహాలు సూచనలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్య తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నిరంతరం పర్యటిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గుడుంబా, గంజాయి, డ్రగ్స్ వంటి నిషేధిత పదార్థాల నివారణకు గ్రామాల్లో ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సైలు అమరేందర్‌రెడ్డి, ఇంతియాజ్, కుమారస్వామి, కానిస్టేబుళ్లు తదితరులు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతు



మరమ్మతు చేయిస్తున్న మాజీ సర్పంచ్‌లు

చిట్యాల: వరదల మూలంగా గిద్దెముత్తారం–కాలువపల్లి ప్రధాన రోడ్డు ధ్వంసమై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రెండు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు పోలవేని పోశాలు, పులి సునీత అంజిరెడ్డి స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించారు. దీంతో రవాణ సౌకర్యం మెరుగుపడడంతో గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వం అండగా నిలవాలి



పరామర్శిస్తున్న పూర్ణచందర్

కాటారం: ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ వరదల్లో గల్లంతైన మహాముత్తారం మండలం పోలారం గ్రామపంచాయతీ ఊట్లపల్లికి చెందిన బీసుల లక్ష్మీరాజ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ అన్నారు. బాధిత కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ తరుపున అండగా ఉంటామని భరోసానిచ్చారు. లక్ష్మీరాజు ఆచూకి కనుక్కోవడం కోసం అక్కడి ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం సంప్రదించి చొరవ చూపాలని తెలిపారు. పూర్ణచందర్ వెంట మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మంద సారయ్య, బూత్ అధ్యక్షుడు రాజు, నాయకులు ఉన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడాలి



మాట్లాడుతున్న మల్లేశ్

చిట్యాల: జిల్లాలోని అన్ని గ్రామాల్లో వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రజలు జ్వరాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని వారిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. డెంగీతో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రులలో మందులు, డాక్టర్లు సిబ్బంది కొరత ఉందని అన్నారు. పీహెచ్‌సీలో 24 గంటల వైద్యం అందేలా జిల్లా యంత్రాగం చూడాలని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు పారిశుద్ధ్య నిధులు కేటాయించి వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రేణుకుంట్ల రాజేష్, చింటు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ ఎన్నిక

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని శ్రీ సాంబమూర్తి ఆలయంలో గణపతి నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ ప్రధాన అర్చకుడు భైరవబట్ల వెంకటేశ్వర శర్మ సమక్షంలో నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా క్యాతరాజు రమేశ్, ఉపాధ్యక్షుడిగా దేవునూరి కుమార్, ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ అశోక్, కోశాధికారిగా మహేందర్, సహాయ కార్యదర్శిగా బత్తిని రాజును ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా వేణవంక నవీన్, క్యాతరాజు రజినీకాంత్, గుడిమళ్ల రమేశ్, వేణవంక ప్రసాద్, తంగళ్లపల్లి వీరబ్రహ్మం, పోలంపల్లి శంకర్, కట్కూరి శ్రీధర్, నీరటి సంతోష్, దేవునూరి అశోక్, అన్నారపు కుమారస్వామి, వనం రాజశేఖర్‌ను నియమించారు.

విద్యార్థినులు చదువులో రాణించాలి



ర్యాలీ చేపడుతున్న అంగన్‌వాడీ టీచర్లు



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీడీపీఓ అవంతి

చిట్యాల: విద్యార్థినులు చదువులో రాణించాలని సీడీపీఓ అవంతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద ఆధ్వర్యంలో పోషణ మాస ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ అవంతి హాజరై మాట్లాడారు. కిశోర బాలికలు తీసుకోవాల్సిన పోషకాహార పదార్థాలు, వ్యక్తిగత పరిశుభ్రత, చదువు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండే వరకు పెళ్లి చేసుకోవద్దని ఎదైనా ఉద్యోగం సాధించిన తర్వాతే పెళ్లి చేసుకోవాలన్నారు. మొబైల్స్‌కు దూరంగా ఉండాలని అన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన ప్రతి విషయాన్ని శ్రద్ధగా విని చక్కగా చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించారు. అలాగే క్రోసూరుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కస్తూరిభాగాంధీ ప్రిన్సిపాల్ సుమలత, అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, జ్యోతి, సుజాత, అరుణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఊర కాల్వకు గండ్లు

గోవిందరావుపేట: మండల పరిధిలోని చల్వాయి గ్రామంలో రైతులు లక్నవరం సరస్సు నుంచే వచ్చే నర్సింహుల కాల్వ నుంచి వచ్చే నీటి ద్వారా రైతులు పంటలు పండిస్తారు. ఈ కాల్వ చల్వాయి గ్రామంలోకి వచ్చే సరికి మూడు కాల్వలుగా విడిపోయి ఊర కాల్వ, పుట్ల పంపు, గొరారం కాల్వల ద్వారా పంట పొలాలకు నీరు అందుతుంది. ఒక్క ఊర కాలువ కింద సుమారుగా 300 ఎకరాల వరి పంట పండుతుంది. కాగా, భారీ వర్షాలకు చల్వాయి లోని ఊర కాలువకు రెండు చోట్ల గండ్లు పడి, పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. దీనితో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. అధికారులు త్వరగా స్పందించి గండ్లు పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

కాళేశ్వరం: గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు తప్పనిసరిగా మండపాలకు అనుమతి తీసుకోవాలని మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విగ్రహం ఏర్పాటు చేసేవారు స్థలం, విగ్రహం ఎత్తు, నిమజ్జనం స్థలం, కమిటీ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. విగ్రహ వివరాలను మీసేవలో లేదా సంబంధిత వెబ్ సైట్‌లో ఆన్లైన్ చేయవలసి ఉంటుందని తెలిపారు. విగ్రహ మండపాల దగ్గర డీజేలకు పర్మిషన్ లేదని, ఎవరు ఉపయోగించరాదన్నారు. మైకుల కోసం పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలం కరెంటు తీగల వద్ద కనెక్షన్లకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎటువంటి గొడవలు లేకుండా శాంతియుతంగా పండుగ నిర్వహించుకోవాలని ఎస్సై సూచించారు.

వరద ముంపు గ్రామాలను ఆదుకోవాలి



పడవలో సరుకులను తరలిస్తున్న జంపయ్య

ఏటూరునాగారం: జిల్లాలోని వరద ముంపు గ్రామాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని జిల్లా బీఆర్ఎస్ నాయకుడు భూక్య జంపయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కొండాయి, మల్యాల, ఐలాపురం ముంపు ప్రాంతాల్లో ఆయన పర్యటించి గ్రామస్తులకు కావాల్సిన సరుకులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కొండాయి బ్రిడ్జి శంకుస్థాపన చేశారు గానీ ఎలాంటి నిర్మాణాలను చేపట్టలేదన్నారు. జ్వరం వస్తే చికిత్సల కోసం పడవలో ప్రయాణించాల్సిన దుస్థితి ఉందన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



గర్భిణి ఆరోగ్య సమాచారం తెలుసుకుంటున్న డాక్టర్ మౌనిక

కాటారం: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులు దరి చేరవని మండల వైద్యాధికారిని డాక్టర్ మౌనిక సూచించారు. మండలంలోని గంగారంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరం, దగ్గు, జలుబు ఇతరాత్ర వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే కొత్తపల్లి, పోతుల్వాయి గ్రామాల్లో డాక్టర్ మౌనిక, వైద్య సిబ్బంది గర్భిణుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. గర్భిణులు ప్రసవం కోసం భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రిలో చేరాలని సూచించారు. గ్రామాల్లో డ్రై డే నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది ఇంటింటా తిరిగి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు డాక్టర్ సుమన్, డాక్టర్ తిరుపతి, హెచ్‌ఈఓ తిరుపతిరెడ్డి హెల్త్ సూపర్‌వైజర్ సరళ, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఏఎన్ఎంలు మనోరమ, నాగరాణి, రజని, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నేడు వంతెన పునఃప్రారంభం



వంతెన వద్ద నాయకులు

టేకుమట్ల: టేకుమట్ల–రాఘవరెడ్డిపేట చలివాగుపై నిర్మించిన వంతెనను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేతుల మీదుగా నేడు (బుధవారం) పునఃప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ తెలిపారు. మంగళవారం వంతెనను పార్టీ నాయకులతో కలిసి పర్యవేక్షి మాట్లాడారు. గత సంవత్సరం అధిక వర్షాల వల్ల వచ్చిన వరద ఉధృతికి కూలిపోగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు చొరవతో రూ.5కోట్ల నిధులను వెచ్చించారని అన్నారు. శాశ్వత రవాణా సౌకర్యం కోసం వంతెన మరమ్మతులను చేపట్టేందుకు నిధులు మంజూరు చేయగా పనులు పూర్తి చేశారని అన్నారు. కాగా, వాహనదారులకు, మండల ప్రజలకు ఎలాంటి రవాణా ఇబ్బందులు తలెత్తకుండా వేసవిలో చలివాగులో తాత్కాలిక మట్టి రోడ్డును సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేడు వంతెన పునఃప్రారంభానికి కాంగ్రెస్ మండల నాయకులతో పాటు, ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మండల నాయకులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



టేకుమట్ల: సాయం అందిస్తున్న గౌడ కులస్తులు



మహాముత్తారం మండలం యామన్‌పల్లిలో..

టేకుమట్ల: మండలంలోని వెంకట్రావుపల్లి(బి) గ్రామానికి చెందిన పెరుమాండ్ల రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మండలంలోని గౌడ కులస్తులు మంగళవారం పరామర్శించి రూ.18,500ల నగదుతో పాటు, 25కిలోల బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ కులస్తులకు ఆర్థికంగా అండగా ఉండేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నేరేళ్ల రామకృష్ణ, చిరంజీవి, నేరేళ్ల శ్రీనివాస్, కోటగిరి సతీశ్‌గౌడ్, సునీల్, ఓంనారాయణ, శంకర్, కుమార్, తదితరులు ఉన్నారు.

కాటారం(మహాముత్తారం): మహాముత్తారం మండలం యామన్‌పల్లి గ్రామానికి చెందిన అట్టెం బాలక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని మంగళవారం ఫ్రెండ్స్ యూత్ సభ్యులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు పున్నం చందు, మల్లేశ్, నితిన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మీటరు కోసం దరఖాస్తు చేసుకోవాలి



సబ్‌స్టేషన్‌లో ఆయిల్ లీకేజీని పరిశీలిస్తున్న అధికారులు

కాటారం: విద్యుత్ మీటరు లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని దీంతో మీటరు పొంది గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ పొందవచ్చని ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ చీఫ్ జనరల్ మేనేజర్ బిక్రామ్ సింగ్ తెలిపారు. మండలంలోని ధన్వాడ సబ్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ ట్యాంక్ లీకేజీ అవుతుండటంతో పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ సీజీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకంలో భాగంగా నిరుపేదకు రూ.825కే విద్యుత్ మీటర్ అందించనున్నట్లు తెలిపారు. విద్యుత్ మీటర్లు లేని కారణంగా పలువురు వినియోగదారులకు గృహజ్యోతి పథకం అందడం లేదన్నారు. ఈ నెల 17 నుంచి పది రోజుల పాటు ప్రజాపాలన కార్యక్రమం ఉండటంతో గృహజ్యోతి పథకంలో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అందుకోసం మీటర్ లేని వారు ఈ నెల 15 వరకే దరఖాస్తు చేసుకొని మీటర్ పొంది ఉండాలని దీంతో గృహజ్యోతి పథకంలో నమోదు చేయబడుతారని వివరించారు. ఆయన వెంట ఈఈ మల్సూర్, ఏడీఈ నాగరాజు, ఏఈఈ మేఘనాత్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

జంపన్నవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం



మాట్లాడుతున్న బొల్లు దేవేందర్

ఎస్ఎస్‌తాడ్వాయి: ఎల్బాక జంపన్నావాగుపై మంత్రి సీతక్క కృషితో త్వరలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి సీతక్క వదరల వలన ఎల్బాక, పడిగాపూర్ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు చేశారని తెలిపారు. పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో పని చేసిన మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎల్బాక వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంపై గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్మాణానికి ఎందుకు కృషి చేయలేదని ప్రశ్నించారు. బ్రిడ్జి నిర్మించాని సీతక్క ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గత ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లిన పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండి ముజఫర్‌హుస్సేన్, మాజీ ఎంపీపీ మొగిలిపల్లి రవి, సింగల్ విండో డైరెక్టర్లు యానాల సిద్దిరెడ్డి, జగన్, జిల్లా నాయకులు తాండాల శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, నాయకులు బండారి చంద్రయ్య ఉన్నారు.